గిరిజన గ్రామ సచివాలయ ఆర్బీకెల్లో ఎరువులు ఎప్పుడు సరఫరా చేస్తారు?

సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ప్రభుత్వానికి సూటి ప్రశ్న

విశాలాంధ్ర-బెలగాం : జిల్లాలో ఉన్నటువంటి గిరిజన గ్రామ సచివాలయ ఆర్బీకెల్లో ఎరువులు ఎప్పుడు సరఫరా చేస్తారని సిపిఐ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో అధిక శాతం గిరిజనులు ఉన్నారని అయితే ప్రకృతి అనుకూలత వలన గిరిజన రైతులు బాగానే పోడు వ్యవసాయం, వరి నాట్లు వేశారు కానీ, ఇప్పటి వరకు గ్రామ సచివాలయ రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సరఫరా జరగక, అధిక డబ్బులు పెట్టి బయటి వ్యాపారస్తుల దగ్గర ఎరువులు కొనుక్కోలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. జులై నెలలో సరఫరా చేయాల్సిన ఎరువులు ఇప్పటివరకు సరఫరా జరపాకపోవడం పై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ గిరిజనులు మరియు గిరిజన రైతులపై ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులకు చిత్తశుద్ధి లేక నిర్లక్ష్య వైఖరి కనపడుతుందని ధ్వజమెత్తారు. పంటల మీద వేల రూపాయలు మదుపులు పెట్టి ఎరువులు లేక పంట దిగుబడులు రాక నష్టపోతామేమోని గిరిజన రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం, ప్రభుత్వాధికారులు వెంటనే స్పందించి రైతులకు వెంటనే ఎరువులు పంపిణీ చేసి వారిని ఆదుకొని రైతులపై, గిరిజనులపై ఉన్న మమకారాన్ని నిరూపించుకోవాలని లేని యెడల గిరిజనులను, రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

మండల స్థాయి అంగన్వాడీ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-సీతంపేట : మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు పరిధిలో జామితోట గ్రామంలో మండల స్థాయి పిల్లల పరిరక్షణ, సంక్షేమ కమిటీ శిక్షణ ఇవ్వడం జరిగింది. సీతంపేట ప్రాజెక్టు సిడిపిఓ బి. సింహాలమ్మ మాట్లాడుతూ మండలంలో ఉన్నటువంటి గ్రామస్థాయి అధికారులందరూ పిల్లల రక్షణ మరియు సంరక్షణ విషయంలో కమిటీ విధులు బాధ్యతలు నిర్వర్తించాలని లైన్ డిపార్ట్మెంట్‌లో ఉన్నటువంటి అధికారులు అందరూ సమన్వయంతో పిల్లల పరిరక్షించాలని తెలిపారు. మన్యం జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఉన్న పంచాయతీ స్థాయి పిల్లల రక్షణ మరియు సంక్షేమ కమిటీలన్నీ సక్రమంగా బాధ్యతలు విధులు నిర్వహించాలని కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పిల్లలు రక్షణకై పాటుపడాలని అదేవిధంగా బాల్యవివాహాలు నివారణ చేయాలని మరియు బాల్య వివాహాలు వలన నష్టాలు అవగాహన చేయాలని మరియు నిలుపుదల చేయాలని. గ్రామాల్లో ఉన్నటువంటి బాలబాలికలు ఎలాంటి బాలల హక్కులు పరిరక్షించాలని, బాల్య వివాహాలు జరగకుండా నివారణ చేయాలని, బాలి వివాహం చేసిన యడ్ల రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు జరిమాను విధించబడినని తెలిపారు. పి.శ్రీధర్ మాట్లాడుతూ బాలబాలికులకు గ్రామస్థాయిలో ఫోక్సో చట్టం గూర్చి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని అదే విధముగా కూర్చుని చట్టం గురించి లైంగిక దాడులు జరిగితే ఎలాంటి వ్యక్తి అయినా శిక్షహరుడు అవుతాడని స్వల్పకాలంలో శిక్ష విధించడం జరుగుతుందని తెలియజేశారు. 0 నుంచి 18 సంవత్సరాలలోపు వయసుగల పిల్లలందరికీ ఈ ఫోక్సర్ చట్టం వర్తిస్తుందని ఈ చట్టం పటిష్టంగా ఉంటుందని మరియు కమిటీ సభ్యుల యొక్క విధులు బాధ్యతలు గురించి క్లుప్తంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాలు మండలంలో గల గ్రామ సర్పంచులు, వీఆర్వోలు, సెక్రటరీలు, సచివాలయం మహిళా సంరక్షణ అధికారులు,, ఏఎన్ఎం, వివో లు, మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్లు మరియు హరికృష్ణ, అపహెరాల్డ్ సంస్థ- కమ్యూనిటీ సోషల్ వర్కర్- ఎన్ నిరూపమ,హాజరవడం జరిగింది అని తెలిపారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం : మంత్రి

విశాలాంధ్ర-సాలూరు : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. మంగళ వారం మంత్రి సంధ్యారాణి స్థానిక ఎమ్మార్వో కార్యాలయం కూడలి వద్ద మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ప్రతీ ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. అధిక మొత్తంలో వినాయక విగ్రహాలు ప్రజలు వినియోగిస్తారన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు వలన నీరు కాలుష్యం అవుతుందని దీనితో మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం వలన పర్యావరణ సమతుల్యతను కాపాడడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించే వీలుంటుందని తెలిపారు. చిన్నారులు, యువత,మహిళలు మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతో ఎఎంసి ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, పాచిపెంట మండల పార్టీ అధ్యక్షుడు గూడెపు యుగంధర్, కౌన్సిలర్ హర్షవర్ధన్, సీనియర్ నాయకులు పప్పల మోహన్, దబ్బి కృష్ణ, కేతిరెడ్డి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు గుర్తించి గ్రౌండింగ్ చేయండి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లాలో పరిపాలన ఆమోదం పొందని పంచాయతీ భవనాలకు ప్రభుత్వ స్థలాలను గుర్తించి తక్షణమే గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంచాయతీ రాజ్ సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లను ఆదేశించారు. జిల్లాకు 80 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా, 68 భవనాలకు పరిపాలన ఆమోదం మంజూరు చేశామని అన్నారు. మిగిలిన 12 భవనాలకు మంజూరు ఉత్తర్వులు పొందకపోవడం పట్ల కలెక్టర్ ఆరా తీశారు. మంగళవారం లోగా స్థలాలను గుర్తించి పరిపాలన ఆమోదం పొందాలని స్పష్టం చేశారు. వీటితో పాటు కొత్తగా మరో ఆరు భవనాలు మంజూరుకాబడ్డాయని వాటిలో సీతంపేటలో నాలుగు, పార్వతీపురం, సాలూరులలో రెండు భవనాలు ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతీ పంచాయతీ భవనంకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షలు, ఉపాధిహామీ కాంపొనెంట్ కింద రూ. 7 లక్షలు వెరసి రూ. 32 లక్షలతో భవనాలు పూర్తి చేయాలని తేల్చిచెప్పారు. ఇదివరకు ప్రారంభమై పెండింగులో ఉన్న పనులను త్వరితగతిన పూర్తిచేయడం, పూర్తయిన భవనాలను స్థానిక మంత్రివర్యులు, శాసన సభ్యులతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. కొత్త పంచాయతీ భవనాల కొరకు ఏఈఈలు సంబంధిత ఎంపీడీఓ, తహసీల్దార్లతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. పంచాయతీ రాజ్ ఏఈఈలు అందుబాటులో ఉన్న నిధులతో పంచాయతీ భవనాలకు రహదారి సౌకర్యాన్ని కల్పించుకోవాలని తెలిపారు. ఉపాధిహామీ రహదారులకు అటవీ శాఖ అనుమతులను త్వరగా పొంది ప్రారంభించాలని చెప్పారు. మంగళవారం ఆయన ఛాంబరు నుంచి పంచాయతీ భవన నిర్మాణాలు, ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.సమాజ భాగస్వామ్యంతో గిరిజన గ్రామాలలో సాధికారిత సాధించడం కొరకు ఆది కర్మయోగి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ఉద్యమం ద్వారా గిరిజన గ్రామాల్లో పాలన, సేవా కార్యక్రమాలు ప్రజలకు చేరువ కానున్నట్లు చెప్పారు. ఇందుకోసం శిక్షణ ముఖ్యమని,ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో ఒకరు, జిల్లా స్థాయిలో ఆది కర్మయోగులుగా ఏడుగురు శిక్షణ పొందినట్లు తెలిపారు. జిల్లాలోని 12 మండలాల నుండి 60 మంది బ్లాక్ స్థాయి కర్మ యోగులను మండలానికి 5 మంది చొప్పున ఎంపిక చేయడం జరిగిందని ఆయన వివరించారు. వీరంతా శిక్షణ పొందేందుకు తగిన వేదికను ఎంపిక చేసుకొని ఈ నెల 28,29 మరియు సెప్టెంబర్ 2,3 తేదీల్లో సూచించిన మండలాల్లో నిర్వహించు కోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఈ కార్యక్రమం ద్వారా చేపట్టబోతున్న విజన్ ప్లాన్ ను సిద్ధం చేసుకొని, గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐటీడిఏ ఏపీఓ ఏ.మురళీకృష్ణ, ఎంపీడీఓలు, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు తీసుకోవాలి

అధికారులతో సమీక్షించిన సబ్ కలెక్టర్, ఎఎస్పి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: వినాయక మండపాల నిర్వాహకులు ముందస్తుఅనుమతులు తీసుకోవాలని సబ్ కలెక్టర్ డా.ఆర్ వైశాలి అన్నారు. వినాయక చవితి పండగ నిర్వహణ, పర్యవేక్షణపై సంబంధిత అధికారులతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏ ఎస్ పి అంకితా సురానా తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మండపాలు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. డిజె సౌండ్ ఉండరాదని ఆమె అన్నారు. మండపాల్లో విద్యుత్ సరఫరాలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వర్షాలు కురుస్తున్న కారణంగా మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యుత్ షాక్ కు గురికావడం వంటి సంఘటనలు తలెత్తరాదని ఆమె స్పష్టం చేశారు. నిమజ్జనం సమయంలోనూ నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అన్నారు. ఊరేగింపులు జరిగేటప్పుడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఊరేగింపు సమయంలో వాహనాలకు దగ్గరగా చిన్న పిల్లలు, మద్యం సేవించిన వ్యక్తులు లేకుండా చూడాలని ఆమె పేర్కొన్నారు. ఊరేగింపు సమయంలో మరీ ఎత్తుగా ఉండే వాహనాలు వినియోగించరాదని, తద్వార విద్యుత్ తీగలకు అంటుకునే అవకాశం ఉంటుందని ఆమె చెప్పారు. ఇనుప రాడ్లు, తీగలు వినియోగించరాదని ఆమె సూచించారు. నిమజ్జనానికి వెళ్ళే భక్తులలో ఈత రాని వాళ్ళు, చిన్నపిల్లలు నీటిలోకి దిగకుండా చూడాలని, చెరువులు, నదులు తదితర ప్రదేశాల్లో నిమజ్జనం చేయునపుడు వాటి లోతు, ప్రవాహ వేగం వంటి అంశాలను గమనించాలని ఆమె అన్నారు. గ్రామాలలో పండగలో పాటించాల్సిన అంశాలను దండోరా వేయించాలని ఆమె ఆదేశించారు. సంబంధిత శాఖలు ప్రమాద నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

పాలకొండ : గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో

జరగాలని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని అధికారులను స్థానిక సబ్ కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గణపతి ఉత్సవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని పారిశుధ్య నిర్వహణపై తగు జాగ్రత్తలు పాటించాలని అలాగే రెవెన్యూ అగ్నిమాపక పోలీస్ యంత్రాంగం పటిష్టంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు ఈ సమావేశంలో డిఎస్పి ఎం.రాంబాబు సీఐ ఎం.చంద్రమౌళి అగ్నిమాపక శాఖ అధికారి సర్వేశ్వర రావు తాసిల్దార్ రాధాకృష్ణమూర్తి ఇతర శాఖల అధికారులు నగర పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీ

విశాలాంధ్ర-బలిజిపేట : మండలం డాక్టర్ సంబంగి శ్రీనివాస రావు గారి మామిడి తోటలో ఉన్న బయో రిసోర్స్ ఇన్పుట్ సెంటర్ వద్ద ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి తిరుపతిరావు సమక్షంలో 2600 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేయడం జరిగింది. దీని తయారీ కొరకు 260 కేజీల ఆవు పేడ, 260 లీటర్ల గోమూత్రం,26 కేజీల బెల్లం, 26 కేజీల శెనగపిండి 6 కేజీల పుట్టమన్ను తీసుకొని పై పదార్థాలన్నింటినీ గోమూత్రంలో కరగదీసి నీటిలో పోసుకున్న తర్వాత వారం రోజులు పాటు ఉదయం సాయంత్రం సవ్య దిశలో కలుపుకోవాలని వివరించారు. ద్రవ జీవామృతాన్ని పంట పొలాల్లో వినియోగించడం వలన భూమిలో అన్ని రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది పంటకు కావలసిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలు లభిస్తాయని తద్వారా నాణ్యమైన అధిక దిగుబడిని పొందవచ్చని వివరించారు. కావున మండలంలోని ప్రకృతి వ్యవసాయ రైతులు కావలసిన వారు బయో రిసోర్స్ సెంటర్ నుండి కొనుగోలు చేసి ఉపయోగించుకుంటారని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితోపాటు కొంతమంది రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు వాగులు దాటే ప్రయత్నం చెయ్యొద్దు

జనసేన పార్టీ మొండిగడ్డ పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుసంగి వీరబాబు

విశాలాంధ్ర-జి.కే.వీధి : భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ మొండిగడ్డ పంచాయతీ ఉపాధ్యక్షులు కుసంగి వీరబాబు అన్నారు. భారీ వర్షాలు నుంచి అతి భారీ పడుతున్నయన్నారు. ప్రజలు సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని ఆయన కోరారు. కాలువలు గెడ్డలు పొంగి ప్రవహిస్తాయి ప్రజలు గెడ్డలు వాగులు దాటే ప్రయత్నం చెయ్యవద్దు అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దు ఆయన పేర్కొన్నారు. అలాగే కొండ చర్యలు విరిగిపడే అవకాశాలు ఉన్నందున పంచాయతీ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మూతపడిన దుంబ్రిగూడ చాపరాయి జలవిహారి

విశాలాంధ్ర-అరకులోయ : వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పా పీడన ప్రభావంతో పర్యాటక ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.గత 14 రోజులుగా కురుస్తున్న భారీ కుండపోత వర్షాలకు ఏజెన్సీ ప్రాంతమైన అరకులోయ, దుంబ్రిగూడ పరిసర ప్రాంతాలలో గడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.దీంతో అప్రమత్తమైన అధికారులు పర్యాటకులకు, స్థానికులకు ఎటువంటి పెను ప్రమాదం జరగకుండా ఉండేందుకుగాను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ ముందస్తు చర్యలు చేపడుతున్నారు.దీనిలో భాగంగానే ప్రముఖ సందర్శిత ప్రాంతమైన దుంబ్రిగూడ చాపరాయి జలపాతాన్ని కలెక్టర్, ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మూడు రోజులపాటు మూసి వేస్తున్నట్లు చాపరాయి జలపాతం ఇంచార్జ్ మేనేజర్ అప్పారావు ప్రకటించారు.ఈనెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకు వర్షాలు తగ్గుముఖం పట్టేదాకా చాపరాయి జలపాతాన్ని మూసివేస్తున్నట్లు సందర్శకులు ఎవరు చాపరాయికి రావద్దని ఆయన స్పష్టం చేశారు. చాపరాయి జలపాతం గడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని దీని దృష్టిలో పెట్టుకొని చాపరాయి జలపాతాన్ని మూసివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. పర్యాటకులు దీన్ని గుర్తించి ఎవరు ఇటువైపు రావద్దని వచ్చిన లోపలికి ఎటువంటి ప్రవేశం ఉండదని ఆయన స్పష్టపరిచారు.

గోతుల రోడ్డుపై నిలిచిన నీరు

విశాలాంధ్ర-కొమరాడ : ఒకవైపు రోడ్డుపై ఏర్పడిన గోతులతో నిత్యం వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే ప్రజా సంఘాల గోల పెట్టడంతో రోడ్డు మరమ్మత్తులు అక్కడక్కడ చేస్తున్నారు. మరోవైపు కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల స్వార్థప్రయోజనాలతో ఆర్ఎంబి రహదారి పూర్తిగా గోతులు ఏర్పడుతున్నాయి. కొమరాడ మండల కేంద్రం శివాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ పెట్రోల్ బంకు అంతరాష్ట్ర రహదారికి ఆనుకొని ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు సొంత ప్రయోజనం కోసం రోడ్డు భవనాల శాఖ స్థలాన్ని ఏకంగా కబ్జా చేసి రోడ్డుపై వరకు పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నారు. పెట్రోల్ బంకు ఏర్పాటు చేసిన ప్రదేశం వద్ద ఆర్ఎంబి స్థలం పై పూర్తిగా కబ్జా చేసి ఎత్తుగా మన్ను పోయడంతో అంతరాష్ట్ర రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉండడంతో ఒకవైపు రహదారి గోతులు అవ్వడానికి ప్రధాన కారణంగా మారుతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు వెళ్లకుండా పెట్రోల్ బంకు యాజమాన్యం నిర్లక్ష్యంగా ఆర్ఎంబి స్థలాన్ని కబ్జా చేసి ఇలా చేయడమే ప్రధాన కారణమని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం నుంచి కునేరు వరకు ఉన్న అంతర్ రాష్ట్ర రహదారి అక్రమాలకు గురవుతున్న కనీసం రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించడం లేదు. దీంతో ఇష్టానుసారంగా రోడ్డుకి ఆనుకొని భవనాలు ఇతర ప్రైవేట్ కాంప్లెక్సు కట్టడంతో రహదారిపై వర్షపు నీరు ఉండిపోయి రోడ్డు మరమ్మతులకు గురవుతుంది. ఇదే పరిస్థితి మండల కేంద్రంలో ఉండడంతో అక్కడ రోడ్డు గోతులమయం కావడంతో పాటు వర్షపు నీరు వాహనాలు వచ్చే సమయంలో పక్కన నడిచి వెళు న్న వ్యక్తులపై పడిపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్ఎంబి అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులా ఉన్న అక్రమాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సామాన్యులకు చేరువలో స్త్రీ శక్తి

- 75శాతం ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం
- పాడేరు స్త్రీ శక్తి కార్యక్రమం సూపర్ హిట్

విశాలాంధ్ర-పాడేరు : మహిళల ఆర్థిక స్వావలంబన కోసం, కూటమి ప్రభుత్వం తెచ్చిన స్త్రీ శక్తి పథకం సూపర్ హిట్ అయ్యిందని పాడేరు నియోజకవర్గం తేదేపా ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు.స్త్రీ శక్తి పథకం సూపర్ హిట్‌గా విజయవంతం అవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పాడేరు మోదకొండమ్మ ఆలయంలో నిర్వహించిన స్త్రీ శక్తి కార్యక్రమానికి అరకు పార్లమెంట్ ఇంచార్జ్ రాష్ట్ర జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిడారి, గిడ్డి లు మాట్లాడుతూ ఉచిత ఆర్టీసీ ప్రయాణం ద్వారా రోజుకు దాదాపు 26.95 లక్షల మంది మహిళలకు లబ్దిచేకూరనుందని, ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, మన రాష్ట్రంలో 11,449 ఆర్టీసీ బస్సులు ఉంటే అందులో 8,458 బస్సులని మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం వినియోగిస్తున్నారన్నారు. దాదాపుగా 80శాతం మంది సామాన్య ప్రజలు ప్రయాణించే పల్లె వెలుగు 5,460 ఎక్స్ ప్రెస్ 1,610 సిటీ ఆర్డినరీ 710 అల్ట్రా పల్లె వెలుగు 391 మెట్రో ఎక్స్ ప్రెస్ 287 ఐదు సర్వీసుల్లో 8,458 బస్సు లో ఈ పథకం అమలులో ఉందన్నారు.ఇతర రాష్ట్రాలకు వెళ్ళే సర్వీసులు, ఏసీ బస్సులు, వేగంగా ప్రయాణం చేయటానికి ఉపయోగించే నాన్-స్టాప్ బస్సు సర్వీసుల్లో మాత్రమే ఉచిత బస్సు ప్రయాణ పథకానికి మినహాయింపు ఉందన్నారు.కేవలం కొన్ని సర్వీసుల్లోనే ఉచిత ప్రయాణం అంటూ, కొంత మంది ఫేక్ బ్యాచ్ చేస్తున్న విష ప్రచారం నమ్మవద్దు అని అన్నారు. 80శాతం మంది ప్రయాణం చేసే 8,458 బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలులో ఉందని మహిళలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు 'మట్టి వినాయక ప్రతిమలే' మిన్న

విజ్ఞాన భారతి ప్రధానాచార్యుడు వెంకటేష్

విశాలాంధ్ర-చింతపల్లి : కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు "మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలే మిన్న మిన్న అని అంతర్ల గ్రామ సమీపంలో ఉన్న విజ్ఞాన భారతి పాఠశాల ప్రధానాచార్యుడు పీ వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహ వాతావరణం లో మట్టితో వినాయకునికి ప్రతిమలు తయారుచేశారన్నారు. ఈ సందర్భంగా కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సమాజ శ్రేయస్సుకై విద్యార్థులు తమ వంతు కృషి చేయాలనే సదుద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని పాఠశాలల్లో నిర్వహించడం జరిగిందని, నేడు (బుధవారం) జరగబోయే వినాయక చవితి పర్వదినాన్ని ప్రతి ఒక్కరు మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ఉపయోగించి భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గెమ్మెల. మోహన్ రావు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అనుమతులను తక్షణమే విరమించుకోవాలి

ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాధిత ప్రజలతో కలిసి తహసిల్దార్‌కి మెమొరాండం

విశాలాంధ్ర-హుకుంపేట : మండలంలో గల భూర్జ, మజ్జివలస పంచాయతీ పరిధిలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం అనుమతులను తక్షణమే విరమించుకోవాలని మంగళవారం ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాధిత ప్రజలతో కలిసి స్థానిక రెవెన్యూ తహసిల్దార్‌కి మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.కృష్ణారావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల ప్రత్యేక హక్కులు చట్టాలను తుంగలో తొక్కిషెడ్యూల్ ప్రాంత భూము లను ప్రభుత్వం అదానికి కట్టబెట్టా లని చూస్తోందన్నారు.అందుకు గిరిజన సంఘం చూస్తూ ఊరుకు నేది లేదని బాధిత ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన అన్నారు. అందుకు ప్రభు త్వమే బాధ్యత వహించాల్సి ఉందని ఆయన తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ అనుమతు లను తక్షణమే నిలుపుదల చేయాల ని ఆయన డిమాండ్ చేశారు, ప్రభు త్వం ఈనెల 28న నిర్వహించే గ్రామసభను బాధిత ప్రజలు వెతిరే కిస్తున్నారని గ్రామసభను అడ్డుకుం టామని ఆయన తెలిపారు. అనంతరం పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగావెలి మెమొరాండం అందజేసినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బూర్జ ఎంపీటీసీ హరిబాబు, స్థానిక సర్పంచ్ పాంగి మొత్తి, వైస్ ప్రెసిడెంట్ సాంబే లక్ష్మీ, నాయకులు కృష్ణంరాజు, సురేష్, పరశురామ్ గిరిజన సంఘం నాయకులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిల్లోగుడలో నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండలంలోని సాగర పంచాయతీ కిల్లో గుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కుమార్ రత్న ఆధ్వర్యంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవ ర్యా లీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి కుమార్ రత్న మాట్లాడుతూ ఈనెల 25 నుంచి సెప్టెంబర్ 8వ వరకు జాతీయ నేత్రదాన పక్ష ఉత్సవాలు జరుగుతాయి అన్నారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం సీలేరు నుండి దారకొండ మధ్యలో ఎరా దిబ్బలు దగ్గర వర్షం కారణంగా మంగళవారం రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోయింది. దీంతో మూడు గంటలసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటి వరకు చెట్టు తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

29న ఉచిత క్యాన్సర్ తలసేమియా స్క్రీనింగ్ శిబిరం

విశాలాంధ్ర-అరకులోయ : ఈనెల 29వ తేదీన అరకులోయ నియోజకవర్గం డుంబ్రిగూడ మండలం అరకు సంత బయలు గ్రామంలో ఆక్సిజన్ హాస్పిటల్ వద్ద ఉచిత క్యాన్సర్ తలసేమియా స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆక్సిజన్ హాస్పిటల్ నిర్వాహకులు నరంజి విజయ్,అనిల్ గోపి తెలిపారు. సోమవారం ఉచిత క్యాన్సర్, తల సేమియా స్క్రీనింగ్ శిబిరానికి సంబంధించి గోడ పత్రికలను విడుదల చేశారు.శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల వరకు జరిగే ఈ శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగపరుచుకోవాలని వారు పిలుపు నిచ్చారు. తల సేమియా.. క్యాన్సర్ సంబంధించి అన్ని సమస్యలకు ఉచితంగా స్క్రీనింగ్ జరపడం జరుగుతుందని స్క్రీనింగ్ లో కనబడే లక్షణాలు ఆధారంగా రోగ బాధితులకు మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు. చిన్నపిల్లలు, పెద్దలకు వచ్చే బ్లడ్ క్యాన్సర్, మహిళలకు రొమ్ములో గడ్డలు, థైరాయిడ్ గ్రంధి వాపు, నోట్లో పుండ్లు,గొంతు నొప్పి, మహిళలలో అధిక రక్తస్రావం ఇంకా అనేక ఆరోగ్య అనారోగ్య రుగ్మతలకు పరీక్షలు జరిపించడం జరుగుతుందని వారు తెలియజేశారు. నిపుణులైన వైద్యానిపుణులతో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీ సూర్య పీఠంలో పూజలందు కోనున్న జ్ఞాన గణపతి

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం రాయగడ రోడ్డు శివారులో గల శ్రీ సూర్య పీఠంలో గత 32 సంవత్సరములుగా చేస్తున్న గణపతి 32 అవతారముల ఆరాధన గతవత్సరంతో 1 ఆవృత్తి పూర్తి అయినది. ఇది ఈ సంవత్సరం 2వ ఆవృత్తిలో 1వ గణపతి అవతార విశిష్ట అర్చన అశేష శేముషీ నిధి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి అధ్వర్యంలో త్రిరాత్ర దీక్షల్లో భాగంగా బుధవారం ప్రాణ ప్రతిష్ఠ గణేశ షడంగ పారాయణ 32 గణపతి మూల మంత్రహవనం యజ్ఞశాలలో కుండ మంటప విహరణ అఖండ దీప స్థాపన అష్టదిగ్బలిహరణ నీరాజన మంత్రపుష్ప స్వస్తివాచనన్నులు జరుగునని నరహరి శాస్త్రి తెలియజేశారు.

బంగారమ్మకాలనీలో బాలగణపతి మండపం ప్రారంభం

విశాలాంధ్ర-సాలూరు : పట్టణం లో బంగారమ్మ కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయం పక్కన నిర్మించిన శ్రీ బాల గణపతి మండపాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మంగళవారం ప్రారంభించారు. ప్రారంభానికి విచ్చేసిన రాజన్నదొరకు కాలనీలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు రాజన్నదొరతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాశ్వతంగా బాలగణపతికి మండపాన్ని నిర్మించాలన్న సదుద్దేశంతో కాలనీ యువత,పెద్దలు నిర్ణయం తీసుకుని మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొరను కలిసి నిర్మాణానికి సహకరించమని కోరారు. శాశ్వత మండపాన్ని రాజన్నదొర సహాయసహకారాలతో ఇటీవల పూర్తిచేశారు. మండపం నిర్మాణం పూర్తి కావడంతో మంగళవారం రాజన్నదొర చేతుల మీదుగా ప్రత్యేక పూజలు జరిపించి మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ బాలగణపతి మండపానికికి కాలనీ వాసుల సహకారంతో శాశ్వత నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బాలగణపతికి పూజలుగావించి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.అనంతరం ఆలయ నిర్మాణానికి సహకరించిన రాజన్నదొరను కాలనీ వాసులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు గిరిరఘు, రాపాక మాధవరావు, భక్తులు పాల్గొన్నారు.

ఏమి జరిగినా కమిటీలదే పూర్తి భాధ్యత

పెదబుడ్డిడిలో ఎస్ఐఎన్ ప్రశాంత్‌కుమార్ వెల్లడి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలో వినాయక చవితి జరుపుకొనే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి ప్రశాంతంగా జరుపుకోవాలని జియ్యమ్మ వలస పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. ప్రశాంత్ కుమార్ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులను కోరారు. మంగళవారం అయన పెద బుడ్డిడి గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు ఆనందోత్సాహాల నడుమ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోవాలని అయన కోరారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో గల ప్రతీ గణేష్ విగ్రహానికి అనుమతి తప్పనిసరని, అనుమతి లేని విగ్రహ కమిటీలు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని అయన హెచ్చరించారు. ముఖ్యంగా ఉత్సవ కమిటీలు డీజేలు మందుగుండు సామాగ్రీ వంటివి వినియోగించరాదనీ అలా వినియోగించిన కమిటీ సభ్యులపై చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని అయన హెచ్చరించారు. ఈయన వెంట కానిస్టేబుల్ పోలయ్య హెూంగార్డ్ పాలపర్తి సూర్యనారాయణ (సురేష్) సచివాలయ మహిళా పోలీస్ జయసుధ ఉన్నారు.

ముందస్తు గణపతి ఉత్సవాలు

- చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సినలి బాధ్యత అందరిది
- విద్యార్థుల్లో భక్తిభావం పెంపొందేలా చర్యలు
- వినాయక చవితిపై అవగాహన
- శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ

విశాలాంధ్ర-ఎటపాక : పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో భక్తి భావం పెంపొందేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ అన్నారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ ఆవరణంలో మంగళవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు సందడిగా జరిగాయి. ఇందులో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో పాఠశాలకు హాజరయ్యారు. నందిగామ, గన్నవరం, తోటపల్లి, సీతాపురం, మురుమూరు, కాపుగోంపల్లి, నెల్లిపాక, చోడవరం, రాయనపేట గ్రామాల నుంచి విద్యార్థులు మట్టితో చేసిన చిన్న చిన్న గణపతి విగ్రహాలను తీసుకొచ్చారు. పాఠశాలలోని ఒక తరగతి గదిలో అన్ని విగ్రహాలను పెట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకట్, రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ పాఠశాలలో అన్నీ పండుగలు నిర్వహిస్తూ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. భావి తరాలు బావు%శీ%దాలంటే పిల్లలకు క్రమ శిక్షణ నేర్పించాలన్నారు. విద్యార్థులకు భక్తిభావం అలవాటు చేయాలని తద్వారా దురలవాట్లకు దూరం అవుతారన్నారు. చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సత్యమల్లికా, నాగజ్యోతి, ఖాసీం, శ్రీను, అప్పాజీ, ప్రసన్న, జ్యోత్స్న, సంధ్య, నమ్రత, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, రమాదేవి, ఇమాన్సి, దివ్య, వెంకటలక్ష్మి, శివదేవి, శివాని, వాసవి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన జీతం 6వేలు అది కూడా నెలల తరబడి ఇవ్వకపోతే ఎలా బతికేది...

గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్స్, గ్రీన్ గార్డ్స్ ఆవేదన

విశాలాంధ్ర-బలిజిపేట : మండలం అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) నగేష్‌కి, డిప్యూటీ ఎంపీడీవో పుష్పరావులకు వినతిపత్రం అందజేసిన గ్రీన్ అంబాసిడర్స్ యూనియన్ (సిఐటియు) ఆ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, పృధ్వి, రాము, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, మాట్లాడుతూలి ఉదయాన్నే నాలుగు గంటల నుండి గ్రామములో చెత్త బల్లుతో చెత్త సేకరణ చేస్తున్నాం నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు వచ్చినప్పుడు గ్రామాల్లో బ్లీచింగ్ చల్లుతున్నాం దోమల మందు పిచికారి చేస్తున్న సున్నం బార్డర్లు వేస్తున్న, తడి చెత్త పొడి చెత్త దుర్గంధం వేద జల్లిన పనిచేస్తున్న, గ్రీన్ అంబాసిడర్లు రక్షణకి ఎటువంటి రక్షణ పరికరాలు లేవు మాస్కులు, గౌస్లులు, కొబ్బరి నూనె, సబ్బులు, చెప్పులు, ఇవ్వకపోవడం ఎంతవరకు న్యాయం అన్నారు ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తున్నటువంటి కార్మికులకు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలి ఇస్తున్న జీతం 6000 కూడా ప్రతినెల చెల్లించాలి ఈ జీతం మీద బ్రతుకుతున్న మాకు నెలలు తరబడి పెండింగ్ పెట్టడం న్యాయం కాదని తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించాలని అన్నారు జూన్ నెలలో ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్స్, గార్డులకు హెల్త్ అలవెన్స్ ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ 4000 రూపాయలు, 2025 జూన్ నుండి అమలు చేయమని ఆదేశాలను వెంటనే అమలు చేయాలని, గ్రీన్ అంబాసిడర్స్ సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఫకీరు, మరియమ్మ, కుమార్, ప్రకాష్, కృపారావు, చంటి, గ్రీన్ అంబాసిడర్స్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని మండలాల హెడ్ క్వార్టర్లు జనరిక్ మందులు షాపులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతంలో అన్ని మండలాల హెడ్ క్వార్టర్స్‌లలో జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో అన్ని మండలాల పరిధిలో ఒక్కొక్క జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బ్రాండెడ్ మెడిసిన్స్ చాలా ఖరీదుతో ఉండడంతో పేదరికంతో, అనారోగ్యాలతో గిరిజనులు ఆయన మందులు కొనుగోలు చేయడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. జనరిక్ మందుల షాపులలో అయితే బ్రాండెడ్ మందులు తక్కువ ధరలకు దొరుకుతాయని. గిరిజన యువత బిఫార్మసి, ఎం ఫార్మసీ చదివి మందుల షాప్స్ పెట్టే ఆర్థిక స్థోమత లేక నిరుద్యోగులుగా ఉంటున్నారు. గిరిజన ప్రాంతంలో అంతంత మాత్రమే ఉన్న ఉపాధిని కూడా దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాప్స్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంటే ఆర్థికంగా ఈ ప్రాంత ప్రజలను ఆదుకునేవారు అవుతారని, నిరుద్యోగ అర్హత కలిగిన గిరిజన యువతకు ఉపాధి కల్పించినట్లు అవుతుందని ఈ విధంగా మండలానికి ఒక జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేసినట్లయితే ప్రజలకు చాలా ఉపయోగం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై ఆలోచన చేయాలని అన్నారు.

గణనాధుని ప్రతిమల ఏర్పాటుకు సిద్ధం

మట్టి వినాయకులతో పూజలు ఆచరించాలంటున్న విద్యార్థులు

విశాలాంధ్ర-చింతపల్లి : వినాయక చవితి పర్వదినాన్ని భక్తులు నేడు నిర్వహించుకుంటున్నారని, ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు ఆచరించాలని విద్యార్థులు అంటున్నారు. స్థానిక విద్యార్థులు మట్టితో తయారుచేసిన ప్రతిమలను చూపుతూ ప్రతి ఒక్కరూ ఇటువంటి మట్టి విగ్రహాలతో పూజలు ఆచరించి కాలుష్యరహిత సమాజానికి సహకరించాలని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. అదే క్రమంలో ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపించేందుకు, రసాయనాల నిషేధానికి కృషి చేయాలని ఈ సందర్భంగా విద్యార్థులు పిలుపునిచ్చారు.

మట్టి వినాయకుడుతోనే పర్యావరణ పరిరక్షించుకుందాం

విశాలాంధ్ర-పాడేరు : మట్టి వినాయకుడుతోనే పర్యావరణ పరిరక్షించుకుందామని ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తగుల మహేష్, కొర్ర కృష్ణ సంఘ సభ్యులు అన్నారు. వినాయక సవితి వేడుకల్లో భాగంగా మినుములూరు పంచాయితీ సర్పంచ్ లక్కెల చిట్టమ్మ కుటుంబ సహకారంతో ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవ సంఘం సభ్యులు పాడేరు కింద బజార్‌లో 1000 ప్రతిమ విగ్రహాలు మంగళవారం పంపిణీ చేశారు.అనంతరం అధ్యక్ష కార్యదర్శులు మహేష్ కృష్ణలు మాట్లాడుతూ పర్యావరణం కాపాడుకోవడంలో అందరు బాధ్యత వహించాలన్నారు. ఈ వినాయక చవితి వేడుకల్లో భాగంగా ప్రతిఒక్కరు మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని అన్నారు. రసాయనాలతో తయారుచేసిన విగ్రహాలతో పర్యావరణాన్ని ముప్పు కలుగుతుందని, నిమగ్నం సమయంలో నీరు కలుషితమై పర్యావరణాన్ని ముప్పు వాటిలుతుందన్నారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలం ప్రధాన కేంద్రంలో కళింగ వైశ్య సంఘం కమిటీ సభ్యులు మట్టి వినాయకుడిని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసి వర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కళింగ వైశ్య సంఘం సభ్యులు పట్నాన రమేష్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి వేడుకలు అందరూ ఎంతో ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మరియు పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని మన అందరి బాధ్యత అని తెలిపారు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలు నీటి వనరులను తీవ్రంగా కాలుష్యం చేస్తాయని ఆ కాలుష్యము మన ఆరోగ్యముపై ప్రతికూల ప్రభావం చూపుతుందని గుర్తు చేశారు మట్టి వినాయకుని విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడమే కాకుండా భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణము అందించే అవకాశం కలుగుతుందని చిన్నారులు యువతులు మహిళలు ముందడుగు వేసి మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని తమ కుటుంబం నుంచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.

బెలగాం : వినాయక చవితి సందర్భంగా పార్వతీపురం జిల్లా కేంద్రంలో పార్వతీపురం వాసవీ క్లబ్ సెంట్రల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా 150 మట్టి గణపతి బొమ్మలు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆడబిడి వీధిలో క్లబ్ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు విఎస్ 3 కెసిజిఎఫ్ చక్కా వెంకట రావు, కొండేటి శ్రీరామమూర్తి, సిమెంట్ వ్యాపారి గంటా శ్రీనివాసరావు వాసవీ క్లబ్ జిల్లా ఆఫీసర్ పేకేటి పుండరీకాక్ష పాల్గొన్నారు.

వి.ఆర్.పురం : వినాయక చవితి పండుగ పురస్కరించుకొని

అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రేఖపల్లి వి ఆర్ పురం రాజుపేట కాలనీ వడ్డి గూడెం తదితర గ్రామాలలో విఘ్నేశ్వర స్వామిని ఆశీనులను చేసి పూజలు నిర్వహించేందుకు భక్తులు మండపాలను ఏర్పాటు చేశారు. మండపాలను రంగురంగుల పూలతో విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. గణపతి దేవుని కొలిచేందుకు , మొక్కు లు చెల్లించుకునేందుకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా వినాయక భక్త కమిటీలు తగు ఏర్పాట్లను చేశారు.

వైద్యుల లేమితో సతమతమవుతున్న లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- ఇద్దరు వైద్యులు ఉండవలసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు ఒక్కరు కూడా లేని పరిస్థితి
- వేరొకరు జాయిన్ కాకుండానే ఉన్న వారిని రిలీవ్ చేసి వైద్యులు లేకుండా చేసిన ఉన్నతాధికారులు
- మెరుగైన వైద్యం అందక గగ్గోలు పెడుతున్న రోగులు, గర్భిణీలు, బాలింతలు

విశాలాంధ్ర-చింతపల్లి : ఒకప్పుడు మన్యం దేముడుగా ప్రసిద్ధి పొందిన వైద్యుడు సత్యనారాయణ విధులు నిర్వర్తించి మన్యంలోనే గాక మైదాన ప్రాంత రోగులను, ఇతర రాష్ట్రాలకు చెందిన రోగులను సైతం ఆకర్షించిన లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు వైద్యాధికారుల లేమితో సతమతం అవుతుంది. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు తప్పనిసరిగా ఉండాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనతో అల్లూరి జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఇద్దరు ఏసు వైద్యుల నియామకం జరిగింది. కానీ ఈ మధ్యకాలంలో సాధారణ బదిలీలలో భాగంగా వైద్యులకు బదిలీలు జరిగినప్పటికీ కొత్తవారు వచ్చి జాయిన్ అయ్యే వరకు పాత వారిని రిలీవ్ చేయకూడదు అనే నిబంధన ఉన్నప్పటికీ, లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాత్రం అందుకు భిన్నంగా బదిలీ అయిన వారిని రిలీవింగ్ చేసే ప్రక్రియ సాగింది. ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్క వైద్యాధికారి కూడా లేని పరిస్థితి తలెత్తింది. సిబ్బంది ఉన్నప్పటికీ, వైద్యులు లేకపోవడంతో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, గర్భిణీలకు సరైన సమయంలో మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఒకప్పుడు చింతపల్లి సిహెచ్‌సి కన్నా ఎక్కువ ఓపి చూపించే లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు వైద్యుల లేమితో సతమతం అవుతుంది. రాష్ట్రంలోనే ఎంతో పేరెన్నిక గన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేసి ఈ ప్రాంత ప్రజలకే గాక ఇతర ప్రాంతాల ప్రజలకు సైతం మన్యం దేవుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఎల్ సత్యనారాయణ మరణానంతరం ఈ ఆసుపత్రి ప్రాంగణంలో ఆయన విగ్రహాన్ని పెట్టడమే గాక ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన ఫోటో (చిత్రపటం) ను ఉండేలా అధికారులు ఆలోచన చేశారు. అంతటి ప్రసిద్ధి చెందిన లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేడు వైద్యుల సమస్యతో కొట్టుమిట్టాడుతూ రోగులకు, అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బందికి పెను సమస్యగా తయారైంది. ఎప్పటికైనా పాలకులు, ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిపుణులైన వైద్యులను నియమించి నాటి గుర్తింపును కొనసాగించేలా కృషి చేయాలని ఈ ప్రాంతీయలు కోరుతున్నారు.

పీహెచ్సీలను త్వరగా సిద్ధం చేయండి : కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఏపీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం పీహెచ్సీల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రుల్లో పడకల కొరత, మౌలిక వసతుల కల్పన, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని గతంలో ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, అయినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. అత్యవసరమైన పనులను చేపట్టేందుకు సీఎస్ఆర్ కింద ప్రతిపాదనలు పంపితే, వాటికి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సాలూరు, భద్రగిరి, కురుపాం, సీతంపేట ప్రాంతాల్లో పీహెచ్సీలను ఆగస్టు మాసాంతానికి అప్పగించాల్సి ఉన్నప్పటికీ, ఇంజినీరింగ్ అధికారులు దృష్టి సారించకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. నేటి నుంచి ప్రతి రోజూ ప్రగతి వుండాలని, పురోగతి ఫోటోలతో తమకు నివేదిక అందజేయాలని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, సిద్ధమైన వాటిని మంత్రివర్యులతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రులకు అవసరమైన బెడ్స్, ఆక్సిజన్ పాయింట్స్, ఐవీ స్టాండ్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆసుపత్రికి త్రీ ఫేజ్ కరెంట్, జనరేటర్ బ్యాకప్, తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ, రహదారి, ఇతర మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. నీటి కుంటలను, రహదారులు, ప్రహరీగోడలను ఉపాధిహామీ కింద చేపట్టుకోవాలని సూచించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో అన్ని వసతులు ఉండాలని, ఎక్కడా ఎటువంటి కొరత లేకుండా చూసుకోవలసిన బాధ్యత అధికారులపై ఉందని ఉద్బోధించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డా.నాగభూషణరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించండి

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం
ఎరువులు, పురుగు మందులు, యూరియాలను బ్లాక్ చెయ్యొద్దు
స్టాక్ నిల్వలు పరిశీలించిన సర్కిల్ ఇన్స్పెక్టర్ వినోద్ బాబు

విశాలాంధ్ర-చింతపల్లి : రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, యూరియా లను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్‌బాబు అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక ఎరువులు, పురుగుమందులు, యూరియా దుకాణాలు, గోదాములను స్థానిక రెవిన్యూ అధికారి మొట్టడం కృష్ణమూర్తి, ఎస్సై వెంకటరమణ, వీఆర్వో పండయ్య లతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆ దుకాణాలలో ఉన్న స్టాకు నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్న యజమానులతో ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, యూరియా తదితర వ్యవసాయ అవసరమైన మందులు పూర్తిస్థాయిలో అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదే క్రమంలో ప్రతి ఏటా నాణ్యమైన ఎరువులు అందక నష్టపోతున్నారని, అటువంటి పరిస్థితులు తలెత్తకుండా వ్యాపారులు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు, యూరియా లను సకాలంలో విక్రయించి రైతులను ఆదుకోవాలని, అదేవిధంగా ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయించి రైతులను నష్టపోయేలా చేస్తే చర్యలు తప్పవన్నారు. నిర్దేశించిన ధరలు కంటే అధిక ధరలకు యూరియాను విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎరువుల దుకాణ యజమానులు ఆలీ, రమణమూర్తి, జోగేశ్వరరావు, రాజు, ఇతర వ్యాపారులు కుమారి, నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

- బదిలీపై వెళ్లిన సహోపాధ్యాయులకు ఘన సన్మానం
- పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మధు

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల విద్యా ప్రగతికి పూర్వ ఉపాధ్యాయులు అందించిన సేవలు అభినందనీయమని స్థానిక గ్రేడ్ 2 ప్రధాన ఉపాధ్యాయులు నమ్మి సూర్యనారాయణ అన్నారు. పాఠశాల నుంచి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన సీనియర్ ఉపాధ్యాయులకు మంగళవారం స్థానిక పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు ఏ .రాజ్ కుమార్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సహోపాధ్యాయులందరూ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలను ఎంపీ యూపీ స్థాయి నుంచి ఉన్నత పాఠశాల స్థాయి వరకు పెంచడానికి పూర్వ ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ, కృషి ఉందన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతోపాటు విద్యార్థులను ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమే అయినప్పటికీ, ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నడూ మర్చిపోలేరన్నారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటే మొదటగా సంతోషించేది ఉపాధ్యాయులేనన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనలను శ్రద్ధగా విని నేర్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన సీనియర్ ఉపాధ్యాయులు కుడుముల కాంతారావు, కిముడు దామోదర్, గుడివాడ శ్రీనివాస్, రొబ్బ వెంకట రమణమ్మ, ఎల్ ఎఫ్ ఎల్. హెచ్ఎం సరమండ బాలగంగాధర తిలక్, పాఠశాల చైర్మన్ కొర్ర మధు, వైస్ చైర్మన్ కూడా హిమజ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకుని నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

జీకే వీధి వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్

విశాలాంధ్ర-జీకే విధి : గూడెం కొత్త వీధి మండల ప్రజలందరికీ వినాయక చవితి సందర్భంగా శు భ ా కా ం క్ష ల ు తెలియజేస్తూ,వినాయక చవితి భక్తి శ్రద్ధలతో కుటుంబ సమేతంగా జరుపుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ అన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు వంకలు పొంగు పొంగుతున్నా యన్నారు. వినాయకుని నిమజ్జనం చేసేటప్పుడు కమిటీ తగు జాగ్రత్తలు తీసుకొని నిమజ్జనం చేసుకోవాలని ఆయన కోరారు.

వినాయక ఉత్సవాలు... వింత పోకడలు



విశాలాంధ్ర-కూనవరం : వినాయక చతుర్థి నాడు ఇళ్లల్లో మాత్రమే పూజలు చేసుకునే ఆచారానికి భిన్నంగా ప్రతి ఊరిలో పందిళ్ళు వేసి, దేశభక్తి గీతాలు, అమరవీరుల సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలుగా జరుపుకోవాలని దేశవ్యాప్తంగా పిలుపునిచ్చిన మహనీయుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్. 1893లో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదుర్కొనేందుకు ఈ పండుగను రాజకీయ చైతన్య వేదికగా మార్చాలని ప్రజల్లో దేశభక్తిని రగిలించే ఐక్యతకు ప్రతిబింబంగా నిర్వహించడం అప్పుడు మొదలైంది. పొద్దుపోతే చాలు బ్రిటిష్ వాళ్ళని ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రసంగాలు పాటలతో ఊరంతా సభా ప్రాంగణంలా ఉండేది. అది కాలక్రమేణా రకరకాల మార్పులు చెంది రణ గొణ ధ్వనులతో కలుషితమైపోయింది. కుల మత వర్గాలకు భిన్నంగా గ్రామ ప్రజలందరినీ ఒక తాటిపై నిలిపి ఒక బృహత్కరమైన ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వినాయక వందిళ్ల కొన్నిచోట్ల నేడు చందాలకు దందాలకు కేరాఫ్ అడ్రస్ గా మారాయి. వీధికొక దేవుడు, కులానికొక దేవుడు, దేవుడు మీ దేవుడు అయిపోయాడు. అందరూ పూజించేది ఒకటే బొమ్మని అయినప్పటికీ అంతర్యాలు పెరిగి పోయాయి. ముందు డీజే బాక్సులు వెనక తీన్మార్ డప్పులు మధ్యలో ఎగిరే యువతికి ఆ పండగపైన వాళ్ళు వేసే డ్యాన్సులపైన క్లారిటీ లేదు. భక్తి భావితరాలకు మంచిని నేర్పాలి, మార్గదర్శకంగా నిలవాలి కానీ భక్తి ముసుగులో ఎటు పోతున్నామో తెలియకపోవడం విచారకరం .

ఉపాధి హామీ పథకంతో 1563 ఎకరాల్లో పండ్ల తోటల మొక్కల పంపిణీ

ఏపీఓ అప్పలరాజు, ఎంపీడీవో ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : ఈ ఏడాది జాతీయ ఉపాధి హామీ పథకంతో మండల పరిధిలో ఇంతవరకు 1563 ఎకరాల్లో వివిధరకాల పండ్ల తోటల మొక్కలను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో జీవిడి ప్రసాద్, ఏపీవో అప్పలరాజు లు తెలిపారు. అలాగే ఉపాధి అధికార్ల ఆధ్వర్యంలో టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ జీసిసి చైర్మెన్ ఎంపీవీ ప్రసాద్ కొయ్యూరులో నిర్వహించిన ఈ మొక్కల పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొని పలువురు రైతులకు పంపిణీ చేసినట్టు ఏపీఓ అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయుటం కోసం కూటమి ప్రభుత్వం ఈ పండ్ల తోటల మొక్కలు పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సపోటా, డ్రాగన్, అవకాడో, మామిడి, పామాయిల్ వంటి ఆదాయాన్ని ఇచ్చే మొక్కలను ప్రభుత్వం పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విండి పోయిన చక్రరావు,వి అర్పి రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజి : 3
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
బుధవారం 27, ఆగస్టు 2025

కూటమి నాయకుల విమర్శలు చేయడం విడ్డూరం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ

విశాలాంధ్ర-వి.ఆర్.పురం :మండలంలో శబరి గోదావరి వరద బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పై విఆర్ పురం మండలం కూటమి నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందనీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అన్నారు. ఆదివారం ఆ పార్టీ మండల నాయకులు ముత్యాల గౌతం ప్రభాకర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు మాదిరెడ్డి సత్తిబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు మాచర్ల గంగయ్య మాట్లాడుతూ వి ఆర్ పురం మండలంలో మాజీ ఎమ్మెల్యే వరద బాధితుల సమస్యల పరిష్కారానికి పర్యటన చేయడం వలన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని దాన్ని జీర్ణించుకోలేక మా నాయకురాలిపై చౌకబారు విమర్శలు కూటమి నాయకులు చేస్తున్నారన్నారు. వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కి వడ్డుగూడెం కాలనీ రాజుపేట శ్రీరామగిరి చింతరేవుపల్లి తదితర గ్రామాల వరద బాధితులు తమ గోడును చెప్పుకున్నారనీ.... వరదల సమయంలో స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష మా బాధలు చూడటానికి రాలేదు కూటమి ప్రభుత్వం వరద బాధితులను పూర్తిగా విస్మరించింది నాలుగు ఐదు రోజుల నుంచి మండలానికి రహదారులన్నీ బంద్దై పూర్తిగా మా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకొని కూలి పనులు లేక నిత్యవసర సరుకులు లేక నానా ఇబ్బందులు పడ్డాము ఈ వరదల సమయంలో మమ్ములను ఆదుకునే విషయంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వారు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి తమ బాధను చెప్పుకోవడం జరిగిందని, మండల నాయకులు ఎవరూ కూటమి ప్రభుత్వాన్ని, నాయకులను విమర్శించలేదని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయాంలో విపరీతమైనటువంటి ప్రళయం లాంటి వరదలు వచ్చినప్పుడు గత ప్రభుత్వం మా ప్రియతమ నాయకులు ఎమ్మెల్సీ అనంత బాబు అప్పటి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి నేరుగా నాలుగు మండలాలు తిరిగి వరద బాధితుల ప్రతి ఇంటికి వెళ్లి వారికి కావలసిన నిత్యవసరాలు అన్ని ప్రభుత్వం ద్వారా వచ్చేలా ఏర్పాటు చేసి వరదలను సమర్థవంతంగా ఎదుర్కోవటం జరిగిందని, అలాగే ఆర్థిక సహాయాన్ని మండలం మొత్తం పార్టీలకతీతంగా అందించిన ఘనత గత ప్రభుత్వానిది కాదా అని ఈ సందర్భంగా వారు అన్నారు. గత వరదల సమయంలో నాలుగు మండలాల్లో మండలానికి ఇద్దరు చొప్పున ఐఏఎస్ అధికారులను నియమించి ఎక్కడా, ఏ ఒక్క వరద బాధితునికి ఇబ్బంది కలగకుండా చేసిన సంగతి కళ్లుండి మీరు చూడలేకపోతే అది మీ విజ్ఞతకే వదిలేస్తున్నాం అని అన్నారు. జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ మాట్లాడుతూ ఈరోజుకి వరద బాధితులకు కొన్నిచోట్ల పూర్తిగా నిత్యవసర సరుకులు అందించలేదని, ఈ ప్రాంతంలో ఉన్న ఒక స్వచ్ఛంద సంస్థ వరద బాధితులను ఆదుకున్న విధంగా కూడా ఈ కూటమి ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. అలాగే డయాలసిస్ బాధితులకు ప్రతి నెల పదివేల రూపాయలు వైద్య ఖర్చుల నిమిత్తం ఇచ్చిన ఘనత గత ప్రభుత్వానిది కాదా... ప్రతి మహిళకు 1500 రూపాయలు ప్రతి నెల అందిస్తానని నేటికీ ఒక్క మహిళకు ఒక్క రూపాయి ఇవ్వకుండా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది కాదా.? 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పెన్షన్ ఇస్తామని నేటికి ఒక్కరికి కూడా ఒక్క పెన్షన్ ఇవ్వకుండా ఆ ఊసే ప్రభుత్వం మీది కాదా.? ఈరోజు వరకు ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలను ఏది పూర్తిగా అమలుచేయలేదనీ అన్ని పథకాలు అరకొరగా ఇచ్చి హామీలు మొత్తం నెరవేర్చామని మీ ముఖ్యమంత్రి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని వారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని వారన్నారు. కూటమి నాయకులు డాంబికాలుమాని ఈ ప్రాంత పోలవరం నిర్వాసితులకు వరద బాధితులకు న్యాయం చేసే దిశగా ముందుకు వెళితే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధులను గుర్తించాలి

- వ్యాధి నిర్ధారణ పక్కాగా ఉండాలి

- ఎన్.సి.డి పిఓ డాక్టర్ టీ జగన్ మోహన్‌రావు

విశాలాంధ్ర-కొమరాడ : వైద్య సిబ్బంది వ్యాధులను సకాలంలో నిర్ధారణ చేయాలని జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు మంగళవారం. కొమరాడ కోటిపాం, గంగరేగువలస గ్రామాల్లో ఆయన సందర్శించారు. కోటిపాంలో నిర్వహించిన సంచార చికిత్సా వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. రోగులకు చేపట్టిన ఆరోగ్య తనిఖీలు,వైద్య పరీక్షల వివరాలు రికార్డులో పరిశీలించారు.రోగులు తెలిపిన ప్రతీ సమస్యనూ స్పష్టంగా నమోదు చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. జ్వర వివరాలపై ఆరా తీసి నిర్ధారణ పరీక్షల కిట్లు,స్లైడ్స్ పరిశీలించారు.క్షేత్ర స్థాయిలో జ్వర నిర్ధారణ తక్షణమే జరగాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాదుల(ఎన్.సి.డి)సర్వేలో గుర్తించిన మరియు ఇదివరకు నుండే ఉన్న బిపి,షుగరు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలపై అడిగి తెలుసుకుని ఆన్లైన్ నమోదు తనిఖీ చేశారు. ప్రతీ నెలా వీరి పర్యవేక్షణ ఖచ్చితంగా ఉండాలన్నారు. సికిల్ సెల్ వ్యాధితో ఉన్న బాలుని ఆరోగ్య స్తితి అక్కడ శిబిరంలో పరిశీలించారు.వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఎన్సీడి4.0 సర్వేలో బాగంగా కేన్సర్ స్క్రీనింగ్ పై వైద్యారోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.104 వాహనంలో ఇసిజి పరికరం పని తీరు పరిశీలించారు.అనంతరం డాక్టర్ జగన్మోహన్ గంగరేగువలస లో చేపట్టిన ఎన్సీడి3.0 సర్వేపై వైద్య సిబ్బందిని ఆరా తీసి సర్వేలో గుర్తించిన బిపి,షుగరు,క్యాన్సర్ వివరాలపై పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకన్నారు. అసంక్రమిత వ్యాదులపై అవగాహన కల్పించే కరపత్రాలను గ్రామాల్లో అందజేశారు ఈ కార్యక్రమంలో కొమరాడ వైద్యాధికారి డాక్టర్ ఎం.శిరీష, సూపర్వైజర్ విజయ నిర్మల,వైద్య సిబ్బంది జయంతి, కృష్ణ వేణి, భవాని, 104సిబ్బంది, ఆశా కార్యకర్తలు,సిహెచ్.డబ్ల్యు లు పాల్గొన్నారు.